క్లుప్తంగా

పేదలకు నిత్యావసరాల పంపిణీ

కాకినాడ రూరల్: మీ కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని అడబాల ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం పేదలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు పిల్లి నాగేశ్వరరావు, సందీప్, వెంకీ మాట్లాడుతూ, దినసరి వేతనాలకు పని చేసే తామంతా సేవా సంకల్పంతో పేదలకు ప్రతి నెలా నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, యజమానులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాలాజీచెరువు: రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం లారీ డ్రైవర్లు, యజమానులకు వైద్య, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా రవాణాశాఖాధికారి కె.శ్రీధర్ మాట్లాడుతూ, నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ప్రతి రోజు ఒక అంశంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో జీవీ శివారెడ్డి, ఎంవీఐ కె.ప్రసాద్, ఏఎంవీఐ మచ్చా కళాజ్యోతి, ఎన్జీవో కాంతమ్మ పాల్గొన్నారు.

భూ విలువ పెంపుపై 24 వరకు అభ్యంతరాల స్వీకరణ



కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 రామారావు

కాకినాడ లీగల్: కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉన్న భూముల మార్కెట్ విలువ పెంపునకు సంబంధించి ఆన్‌లైన్‌లో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నోటీస్ బోర్డ్‌లో ప్రతిపాదనల కాపీలు పెట్టామని కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 ఆర్‌వీ రామారావు సోమవారం వెల్లడించారు. మార్కెట్ విలువపై అభ్యంతరాలను ఈ నెల 24వ తేదీ సాయంత్రం వరకు ప్రజల నుంచి స్వీకరిస్తామని చెప్పారు. అలాగే ఆర్డీవో, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాలకు, తహసీల్దార్లకు ఉత్తర్వులు పంపించామన్నారు. పెరిగిన విలువలు ఫిబ్రవరి ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి.

ఆకట్టుకున్న గాత్ర కచేరి



గాత్ర కచేరి చేస్తున్న పతంగి సోదరులు

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి గానసభల్లో భాగంగా సోమవారం రాత్రి చెన్నైకు చెందిన పతంగి సోదరులు శ్రీదాత్రే, ధ్రువ్ గాత్ర కచేరి నగర ప్రజలను ఆకట్టుకుంది. సౌరాష్ట్ర రాగంలో శరణు సిద్ధి వినాయక, కేదారగౌళ రాగంలో ద్వాదశ జ్యోతిర్లింగ గీత మాల రేయి పగలు నిన్నే నమ్మినాను, పంతువరాళి రాగంలో ఎన్నుగాను రామభజన, కమాస్ రాగంలో బ్రోచేవారెవరురా వంటి కీర్తనలు పాడి శ్రోతలను మైమరపించారు. వీరికి వయోలిన్‌పై మాధవన్, మృదంగంపై కె.యోగేష్, ఘటంపై సరస్వతుల హనుమంతరావు వాయిద్య సహకారం అందించారు. తొలుత రెండో రోజు గాత్ర కచేరిని ఆలపాటి లక్ష్మీసుభద్ర, సుభాషిణి, పంతం నాగేశ్వరి, చావలి సూర్యకుమారి, కె సుబ్బలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

కాకినాడ లీగల్: కాకినాడ ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపిన 15 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా, 15 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు తెలిపారు.

పక్కా గృహాల కోసం ధర్నా



జనసేన పార్టీ జెండాలతో ధర్నా చేస్తున్న స్థానికులు

బాలాజీచెరువు: నగరంలోని 12వ డివిజన్‌లో ఏఎంజీ స్కూల్ వద్ద సోమవారం దాదాపు 40 కుటుంబాలకు చెందిన వారు జనసేన పార్టీ జెండాలతో ధర్నా నిర్వహించారు. కాలిపోయిన ప్రదేశంలోనే పక్కా గృహాలు నిర్మించాలని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తమకు న్యాయం చేయాలంటూ నిరసన తెలుపుతూ ధర్నా కొనసాగించారు. తమ సమస్యపై పవన్‌కల్యాణ్ స్పందించే వరకూ ధర్నా విరమించబోమంటూ నినాదాలు చేశారు.

ఆశల పూత.. మారేనా రాత..!

- ఈ ఏడాదైనా లాభాలు గడించవచ్చని ఆశపడుతున్న మామిడి రైతులు
- పెట్టుబడి పెరగడంతో దిగుబడిపైనే దృష్టి
- అనవసరంగా రసాయన మందులు వాడొద్దంటున్న వ్యవసాయ నిపుణులు




కరపలో కాలువ గట్టుపై పూత విరగబూసిన మామిడి చెట్లు

కరప: వేసవికాలం వస్తుందంటే మండుటెండలు, వేసవితాపం గుర్తుకువస్తుంటాయి. వీటితో పాటు నోరూరించే మధురఫలం మామిడి, ఆవకాయ పచ్చడి కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తుంటారు. ఈ సీజన్‌లో మామిడి పూత రైతుల్లో ఆనందం కలిగిస్తోంది. మండలంలోని అనేక గ్రామాల్లోని మామిడి చెట్లకు పూత విరగబూయడంతో మామిడి రైతులలో ఆశలు చిగురిస్తున్నాయి. గతేడాది మామిడికాయల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా, ఆశించిన ధర రాక చాలామంది రైతులు నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది ఆ నష్టాలను భర్తీ చేసుకునేందుకు మామిడితోటలను అధిక రేట్లకు కొనుగోలు చేశారు. కొన్ని గ్రామాల్లో రెట్టింపు రేట్లకు కొనుగోలు చేసిన రైతులు.. గాలిగొమ్ములు రాకుండా చూసి, మామిడి పంటను దక్కేలా చూడాలని భగవంతుడిని కోరుకుంటున్నారు.

కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో సుమారు 250 ఎకరాల మేరకు మామిడితోటలు, మరో 100 ఎకరాల్లో కాలువగట్టు, పొలం గట్లపైన మామిడి చెట్లు ఉన్నాయి. కరప మండలంలో కరప, గురజనాపల్లి, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కొరుపల్లి, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, కూరాడ, వలసపాకల తదితర గ్రామాల్లో మామిడి తోటలున్నాయి. ఇవికాకుండా కాలువ గట్లపైన, పొలం గట్లపైన మామిడి చెట్లు ఉంటాయి. గతేడాది కాపులేని తోటలు ఈ ఏడాది బాగా కాస్తాయనే ఉద్దేశంతో మామిడితోటలు కొన్నట్టు నల్లా అన్నారం, పి.సత్తిబాబు తదితర మామిడి రైతులు తెలిపారు. ఇప్పటికే చాలా ఖర్చు చేసి మూడుసార్లు పురుగు మందులు పిచికారీ చేసినట్టు మామిడి రైతులు చెప్పారు. గతేడాదితో పోలిస్తే కొన్ని ప్రాంతాల్లో పూత కొమ్ములు ముందుగానే వచ్చినా, కొన్ని ప్రాంతాల్లో మామిడి తోటలు ఆలస్యంగా చిగురిస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతానికి మామిడి పూత ఆశాజనకంగానే ఉన్నట్టు రైతులు అంటున్నారు. తేనెమంచు కురవకుండా వాతావరణం అనుకూలిస్తే మామిడి పంట దిగుబడులు బాగుంటాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతికూల వాతావరణం లేకపోతే..

కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని కరప మండలంలో 190 ఎకరాల విస్తీర్ణంలో మామిడితోటలున్నాయి. గతేడాదితో పోలిస్తే మామిడి పూత బాగా వస్తోందని రైతులు అంటున్నారు. వాతావరణం అనుకూలించి, తేనెమంచు కురవకుండా ఉంటే పూత నిలబడుతుందని, లేకపోతే పూత మాడిపోయి కాపు లేకుండా పోతుందంటున్నారు. మామిడికాయలు పెరిగే సమయంలో వేసవిలో గాలిగొమ్ములు వంటి ప్రతికూల వాతావరణం లేకపోతే, కాసిన మామిడికాయలు అక్కరకు వస్తాయని, లేకపోతే దిగుబడులు తగ్గిపోయే అవకాశం లేకపోలేదని మామిడిరైతులు చెబుతున్నారు. ఏటా గాలిగొమ్ముల వల్ల కాసిన మామిడికాయలు రాలిపోయి, నష్టాలను చవిచూస్తున్నామని, ఈ ఏడాది అటువంటివి రాకుండా ఉంటే లాభాల మాటెలా ఉన్నా, పెట్టుబడులు దక్కి, కష్టార్జితం మిగిలితే చాలని వారంటున్నారు.



వాకాడ వద్ద పుంత మార్గంలో మామిడి చెట్టు పూత

- **నల్లమచ్చ తెగులు:** జనవరిలో తేనెమంచు పురుగు ఆశిస్తుంది. పూత కొమ్మలోని లేత ఆకుల నుంచి రసం పీల్చడం వల్ల పిందెలు రాలిపోతుంటాయి. నల్లని తేనె వంటి పదార్థాన్ని విసర్జించడం వల్ల నల్లమచ్చ తెగులు వస్తుంది. నివారణకు ఎసిఫేట్ పొడరు గ్రాము మందు లీటరు నీటికి కలిపి, వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- **బూడిద తెగులు:** తెలుపు రంగు పౌడర్ లాంటి పదార్థం పూత కొమ్మలు, పిందెలు, లేత ఆకులపై ఏర్పడుతుంది. దీనివల్ల పిందెలు రాలిపోతుంటాయి. నివారణకు వెట్టబుల్ సల్ఫర్ గ్రాము మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **పక్షికన్ను తెగులు:** పక్షి కన్ను ఆకారంలో చిన్నటి మచ్చలు పూత కొమ్మలపైన, లేత ఆకులపైన, లేతపిందెలపైన ఏర్పడి, క్రమేపి పిందెలు రాలిపోతుంటాయి. చల్లటి వాతావరణం ఈ తెగులు వ్యాప్తికి అనుకూలిస్తుంది. నివారణకు కార్బండిజమ్, మెన్‌కోజెట్‌ల్లో ఏదో ఒకటి గ్రాము మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



మామిడి రైతులు అప్రమత్తంగా ఉంటూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటే మామిడి పంటను దక్కించుకోవచ్చు. మామిడి పూతదశలో తేనెమంచు వల్ల కలిగే నష్టం నుంచి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం వాతావరణం మామిడిపూతకు అనుకూలంగానే ఉంది. రైతులు తొందరపడి అనవసరంగా రసాయన మందులు పిచికారీ చేయరాదు. పూత రాలేదని చాలామంది రసాయన మందులు పిచికారీ చేస్తుంటారు, దానివల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ. పూత నుంచి పిందె దశకు మారే సమయంలో, తేనెమంచు వల్ల నష్టం కలగకుండా మామిడి రైతులు అప్రమత్తమై రసాయన మందులు పిచికారీ చేస్తే కాపు నిలుస్తుంది.

– ఏవీ రాజేష్, ఏఓ, కరప

పెట్టుబడులు పెరిగాయి



రైతులు మామిడితోటల ధరలు పెంచేస్తున్నారు. పిందె దశ వచ్చే వరకు మూడు, నాలుగు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. పశువులు రాకుండా తోటల చుట్టూ కంచె వేయడానికి ఖర్చులు పెరిగిపోయాయి. మామిడి దిగుబడులు బాగుంటే, కష్టార్జితమైనా మిగులుతుంది. తేనెమంచు, గాలిగొమ్ములు వంటి ప్రతికూల వాతావరణం ఉంటే లాభాల మాటెలా ఉన్నా, పెట్టుబడులు కూడా దక్కవు.

– నల్లా అన్నవరం, మామిడిరైతు, కరప

మెరుగైన పారిశుధ్య సేవలే లక్ష్యం

కార్పొరేషన్ కమిషనర్ భావన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. సోమవారం ఉదయం ఆమె పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. స్థానిక రామారావుపేట, మూడు లైట్ల జంక్షన్, భానుగుడి ప్రాంతాల్లో సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. ఇంటింటా చెత్త సేకరణ జరుగుతున్న తీరును పరిశీలించారు. చెత్త సేకరణ వాహనాల రాకపోకల సమయాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దడంలో ప్రతి ఉద్యోగి మరింత కష్టపడి పనిచేయాలన్నారు. ఆమె వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు నాయుడు, రాంబాబు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు ఉన్నారు.

ప్రతి సమస్యకు సత్వర పరిష్కారం

ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో సుమారు 15 మంది వివిధ సమస్యలపై కమిషనర్‌కు వినతులు అందజేశారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సుమారు 25 మంది వివిధ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. పరిష్కారమైన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు.

రీజనల్ పాస్టర్ల కమిటీ సమావేశం

కాకినాడ సిటీ: బెరాకా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు రెవరెండ్ బి.దివాకర్ ఆధ్వర్యంలో కాకినాడ సిటీ రీజనల్ పాస్టర్ల కమిటీ సమావేశం సోమవారం కాకినాడ రూరల్ మండలం చీడిగ బెరాకా మినిస్ట్రీస్ చర్చిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్టర్ల సంఘ గౌరవాధ్యక్షుడు రెవరెండ్ జోసెఫ్ బిన్నీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవంలో తలెత్తిన, పాస్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన వివరించారు. ఆయా సమస్యలను సమైక్యంగా పరిష్కరించుకునేందుకు తీర్మానం ఆమోదించారు. సమస్యల పరిష్కారానికి ప్రతీఒక్కరూ ముందుకు వచ్చి, కలిసికట్టుగా పరిష్కరించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కమిటీ రీజనల్ చైర్మన్ రెవడెండ్ దడాల జాషువాగిరి, కార్యదర్శి పి.రాజు ప్రసంగించారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా జనరల్ సెక్రటరీ రెవరెండ్ సీరం ఐజాక్, మిస్సా విజయకుమార్, డి.విల్సన్, పి.శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో చైతన్యకుమార్ ప్రతిభ



నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జాతీయ స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో కాకినాడకు చెందిన క్రీడాకారుడు చైతన్యకుమార్ ప్రతిభను కనబరిచి రజత పతకం కైవసం చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్ నగర్‌లో ఈ నెల 10 నుంచి 14 వరకు ఈ పోటీలు జరిగాయి. గతేడాది అక్టోబర్‌లో రాజమహేంద్రవరంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో చైతన్యకుమార్ విశేష ప్రతిభ చూపి, ఈ పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయి పోటీల్లో ఢిల్లీ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌పై గెలిచిన ఆంధ్రా జట్టు, ఫైనల్స్‌లో తెలంగాణపై 4 గోల్స్ తేడాతో ఓటమి పాలై, రజత పతకం పొందింది. ఈ జట్టుకు మేనేజర్‌గా బి.చంద్రశేఖర్, కోచ్‌గా వీరస్వామి వ్యవహరించారు. కాగా, చైతన్యకుమార్ స్థానిక రామారావుపేట నారాయణ స్కూల్‌లో చదువుతున్నాడు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అతడికి పాఠశాల ఏజీఎం రాఘవేంద్రరావు మెడల్ అందజేశారు. అతడిని పాఠశాల జోనల్ అకడమిక్ కో-ఆర్డినేటర్ సుంకర మూర్తి, ప్రిన్సిపాల్ షర్మిల, డీన్ రమణారావు, ఉపాధ్యాయులు కాంచన, అపర్ణ, పీడీ సతీష్ అభినందించారు.

ఇంటి మార్గం ఆక్రమణపై ఫిర్యాదు

కరప: తన ఇంటికి వెళ్లే మార్గాన్ని ఆక్రమించుకోవడమే కాకుండా, అడిగినందుకు దాడి చేసి, కులంపేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని కరప మండలం పాతర్లగడ్డకు చెందిన చాపల నాగభూషణం సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీ రాహుల్ మీనాకు అర్జీని అందజేశారు. బాధితుడు తెలిపిన వివరాలు మేరకు, పాతర్లగడ్డ గ్రామంలో 1995లో కొంత స్థలాన్ని నాగభూషణం కొనుగోలు చేశాడు. అందులో కొంత స్థలాన్ని పొన్నాడ సత్యవతికి విక్రయించాడు. ఐదు అడుగుల వెడల్పుతో మార్గం వదిలిపెట్టినట్టు దస్తావేజులో రాయించి, రిజిస్ట్రేషన్ చేయించాడు. దారికి వదిలిన స్థలాన్ని సత్యవతి ఆక్రమించి, ఇంటిని నిర్మించింది. దానిని ముత్యాల సత్యనారాయణమ్మకు విక్రయించింది. తన ఇంటికి వెళ్లేందుకు నాగభూషణం తూరలు వేసుకోగా, సత్యనారాయణమ్మ, ఆమెకు చెందిన వ్యక్తులు వాటిని తొలగించి, కులంపేరుతో దూషించి, అతడిపై దాడికి దిగారు. ఈ సంఘటనను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని బాధితుడు నాగభూషణం గ్రీవెన్స్‌లో అర్జీని అందజేశారు.

ఇంధన సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలి

బాలాజీచెరువు: పునరుత్పాదక ఇంధన సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకే మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 25 వరకూ ఎమర్జింగ్ టెక్నాలజీ ఇన్ ఆప్టిమైజింగ్ రెన్యూబుల్ ఎనర్జీ సిస్టమ్ విత్ స్మార్ట్ మెటీరియల్ సొల్యూషన్ అనే అంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించే వర్క్‌షాపు సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతికత, స్మార్ట్ మెటీరియల్స్‌పై దృష్టి సారించడంతో పాటు, పునరుత్పాదకత చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 9 వరకూ ఏపీ, తెలంగాణ, కేరళ, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్, గుజరాత్, మహారాష్ట్రకు చెందిన 138 అధ్యాపకులు ఆన్‌లైన్‌లో హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహనరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వీవీ సుబ్బారావు, లింగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

మితాహారంతో ఆరోగ్యకర జీవనం

కాకినాడ రూరల్: ఆరోగ్యవంతమైన జీవనం మితాహారంతోనే లభిస్తుందని పోషకాహార నిపుణురాలు మల్లీశ్వరి తెలిపారు. స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో సోమవారం ఆరోగ్య అవగాహన సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి శక్తి అవసరమని, అవి ఆహార పదార్థాల ద్వారా లభిస్తాయన్నారు. తృణధాన్యాల్లో పీచు పదార్థం అధికంగా ఉంటుందని, మొలకెత్తిన గింజలు, చేపలు, వాల్‌నట్స్, సోయా బీన్స్ వంటివి తీసుకోవాలన్నారు. మైదా, వేపుడు, తీపి పదార్థాలు, కేకులు పరిమితంగా తీసుకోవాలన్నారు. ప్రతి రోజు నిద్ర లేవగానే గోరు వెచ్చని నీటిని తాగడం ద్వారా శరీరంలోని మలినాలు విసర్జింపబడతాయన్నారు. కార్యక్రమంలో అడబాల ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు



వేళంగిలో అధికారులకు సూచనలిస్తున్న సీఈఓ లక్ష్మణరావు

కరప: రానున్న వేసవిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రక్షిత మంచినీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పరిషత్ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. మండల పర్యటనలో భాగంగా సోమవారం ఆయన కరప, వేళంగి గ్రామాల్లోని సామూహిక రక్షిత మంచినీటి పథకం చెరువులను, ఫిల్టర్ పాయింట్లను పరిశీలించారు. ప్రతి వారం గ్రామాల్లోని వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించి, నిర్దేశించిన సమయానికి రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. మంచినీటి పైపులైన్లకు లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 64 నీటి పథకాలుండగా, కాకినాడ జిల్లాలో 20 ఉన్నాయన్నారు. వారానికి రెండు మంచినీటి పథకాలను పరిశీలించి, అక్కడ ఏమైనా లోపాలుంటే సరిదిద్ది, నాణ్యమైన మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో నీటిమట్టం తగ్గిపోవడం వల్ల నాచు పేరుకుంటుందని, దానివల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కరపలో రక్షిత మంచినీటి పథకం వద్ద ఓపెన్‌గా క్లోరినేషన్ చేయడం వల్ల పక్కనున్న అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఇబ్బందికరంగా ఉంటోందని స్థానికులు సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. క్లోరినేషన్ చేసేందుకు గది నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సీఈఓ హామీ ఇచ్చారు. అనంతరం వేళంగిలో రక్షిత మంచినీటి పథకం చెరువును, క్లోరినేషన్ భవనాన్ని సీఈఓ పరిశీలించారు. చెరువులో బాణసంచా, ఇతర వ్యర్థాలు ఉండటాన్ని గమనించి, చెరువులో ఎటువంటి వ్యర్థాలు లేకుండా శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎం.అనుపమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీవీఎస్ వర్ధన్, ఏఓ బీఎల్ నరసింహం, టి.సుబ్రహ్మణ్యం, కార్తీక్, కార్యదర్శులు యు.నిర్మలాదేవి, పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో మెరుగైన సేవలే లక్ష్యం

సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ద్వారకా తిరుమలరావు



క్రీడల్లో పతకాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

కాకినాడ: ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రతి ఉద్యోగి మరింత కష్టపడి పనిచేయాలని డీజీపీ, ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు అన్నారు. సోమవారం ఆయన కాకినాడ ఆర్టీసీ డిపోను సందర్శించారు. అక్కడ పరిసరాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం కాకినాడ డిపో పరిధిలోని ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎండీ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ, మెరుగైన రవాణా సదుపాయాన్ని అందించడంలో ప్రతి ఉద్యోగి మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్లు ఎంజే రావు, వీఎస్ మూర్తికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ విజయవాడ జోన్ డిప్యూటీ డైరెక్టర్ గొల్ల విజయరత్నం, కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్లు కె.ప్రభాకరరావు, ఎస్‌కేఎం బాషా, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ ప్రారంభించిన డీజీపీ

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌ను డీజీపీ ద్వారకా తిరుమలరావు సోమవారం సందర్శించారు. జిల్లా కేంద్రం కాకినాడకు విచ్చేసిన ఆయన ఏపీఎస్పీ బెటాలియన్‌లోని ఇంగ్లిషు మీడియం స్కూల్ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఆయనకు బెటాలియన్ కమాండెంట్ దీపిక, సిబ్బంది స్వాగతం పలికారు. విద్యార్థులు నృత్యాలు చేసి డీజీపీని స్వాగతించారు. సైన్స్ ల్యాబ్ ప్రారంభించి విద్యార్థులకు ప్రయోగాలకు ఉపయోగించే కెమికల్స్ తదితర వాటిని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఏపీఎస్పీ బెటాలియన్ క్యాంప్ కార్యాలయాన్ని సందర్శించి, శిక్షణ పొందుతున్న ముగ్గురు ట్రైనీ డీఎస్పీలు, బెటాలియన్ అధికారులతో మాట్లాడారు. ఐజీ జీవీకే అశోక్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ అధికారి సుస్మిత, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్‌లు పాల్గొన్నారు.

రెడ్ కాన్వెంట్ ట్రస్ట్‌కు అటవీ శాఖ ప్రశంసలు



బాదం బాలకృష్ణకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎఫ్ఓ

బాలాజీచెరువు: పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల ట్రస్ట్‌కు జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు సోమవారం ట్రస్ట్ అధ్యక్షుడు బాదం బాలకృష్ణకు ప్రశంసాపత్రం అందజేశారు. ట్రస్ట్ ద్వారా కోరంగి అటవీ ప్రాంతంలో వనాల పెరుగుదలకు అవసరమయ్యే ఉప్పునీరు ప్రవహించడానికి వెళ్లే కెనాల్స్, సబ్ చానల్స్‌లో పూడిక తీత పనులు చేపట్టినందుకు అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, శాప్ మాజీ ఎండీ బంగార్రాజు సలహా మేరకు ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టామని, పర్యాటక ప్రాంతంగా వృద్ధి చెందుతున్న ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాదాపు మూడు కి.మీ. నీటి ప్రవహానికి దారి ఏర్పాటు చేశామన్నారు. అలాగే త్వరలో బెంచీల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి డీవీఆర్ జగన్నాథరావు, పద్మనాభం, రమణమూర్తి పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

కరప: పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. గొర్రిపూడిలో సోమవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశు వైద్యులు ఎం.రవికిరణ్‌బాబు, అనిల్‌విల్సన్, సువర్ణ, సమన్విత పశువులు, లేగ దూడలకు పరీక్షలు నిర్వహించారు. జలగ వ్యాధి, ఏలికపాము నివారణ టీకాలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణకు టీకాలు వేశారు. పశువుల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీటీసీలు వై.వెంకటలక్ష్మి, పి.సింహాద్రమ్మ, పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ సూర్యప్రకాష్, డీడీ డాక్టర్ అంబేడ్కర్, కరప సబ్ డివిజన్ ఏడీ డాక్టర్ ఎన్‌జేఎస్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. 21 మంది రైతులు తమ లేగదూడలను ప్రదర్శించారు. ఆరోగ్యవంతంగా మూడు లేగదూడలకు బహుమతులు అందజేశారు.

జనసేన నాయకుడిపై దాడి

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన జనసేన నాయకుడు దుగ్గిన బాబ్జిపై దాడి జరిగింది. సోమవారం కాకినాడలోని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పలువురు వ్యక్తులు తనపై దాడికి పాల్పడినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంది కన్నబాబుతో పాటు, మరికొందరు మారణాయుధాలతో తనపై దాడికి పాల్పడ్డారని బాబ్జి ఫిర్యాదులో పేర్కొన్నారు. గొడవకు రియల్ ఎస్టేట్ నేపథ్యమే కారణమని తెలుస్తోంది. కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు తెలిపారు.

ఘనంగా ఏఐసీసీ జిల్లా నూతన సంవత్సర వేడుక



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ స్టీఫెన్ ఆనంద్

కాకినాడ రూరల్: ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా 2025 నూతన సంవత్సర వేడుక కాకినాడ రూరల్ రాయుడుపాలెంలోని సీటీసీ ప్రాంగణంలో సోమవారం ప్రధాన కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ స్టీఫెన్ ఆనంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు బ్రదర్ జాన్ రిక్కీగూటం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్టీఫెన్ ఆనంద్ మాట్లాడుతూ, గత ఏడాది కాలానికి ఏఐసీసీ రాష్ట్ర కమిటీ, కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ ఏడాది నిర్వహించే ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు బిషప్ జోసెఫ్ బెన్నీ, రాష్ట్ర, కాకినాడ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు, కార్యవర్గ సభ్యులు, ఏడు రీజియన్ల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు సుమారు 200 మంది హాజరయ్యారు.